ఆంధ్ర చరిత్ర బౌద్ధ మత వ్యాప్తి...

వైదిక మతంలోని బ్రాహ్మణాధిక్యత, కర్మకాండలు, యజ్ఞయాగాదులు, జంతు బలులు వంటి పరిస్థితుల పట్ల సామాన్య ప్రజల్లో నిరసన వ్యక్తం అవుతున్న తరుణంలో జైన, బౌద్ధ మతాలు ఆవిర్భవించినట్లు చరిత్ర తెలుపుతోంది. ఈ పరిస్థితులు ఉత్తర భారతంతో పాటు ఆంధ్రదేశంలోనూ ఏర్పడ్డాయి. యక్ష, నాగ వంటి ప్రాచీన జాతులు బ్రాహ్మణాధిక్యతను సహించలేకపోయాయి. సుత్తని పాతం ప్రకారం.. దక్షిణ భారతానికి చెందిన సఖీయ అనే యువకుడు, వైదిక మతంలో సంతృప్తి లభించక ఉత్తర భారతదేశం వెళ్లి, బుద్ధుడి శిష్యుడైనట్లు తెలుస్తోంది. వేదాధ్యయనంతో సంతృప్తి చెందని కాస్థిలుడనే బ్రాహ్మణుడు కూడా బుద్ధుని శిష్యుడైనట్లు 'మజ్జిమనికయ' వివరిస్తుంది. వీటిని బట్టి చూస్తే వైదిక మతంలో మొదలైన అసంతృప్తి కారణంగానే బౌద్ధమతం ప్రజాదరణ పొందినట్లు తెలుస్తోంది. ఆంధ్ర దేశంలో బౌద్ధమతంతో పాటు, వైదిక ధర్మం కూడా అభివృద్ధి చెందుతూనే వచ్చింది. త్రిపీఠకాలు రూపొందిన కాలంలోనే గృహ్య, శ్రౌత సూత్రాలు, ఇతిహాస పురాణాలు రూపొందాయి. బౌద్ధ మతాన్ని మహా సాంఘికులు ఉధృతంగా ప్రబోధిస్తూ అమరావతి-శ్రీధాన్యకటక మహాచైత్యాన్ని నిర్మించే రోజుల్లోనే, వైదిక మతానికి చెందిన అపస్తంభ ధర్మసూత్రం వెలువడింది.

ఆంధ్రదేశంలో బౌద్ధమతం

ఉత్తర భారతదేశంలో కోసలతో-ఆంధ్రదేశానికి సాంస్కృతిక సంబంధాలుండేవి. కోసల దేశంలో బుద్ధుడు స్వయంగా, విస్తృతంగా పర్యటించి ధర్మ బోధన చేశాడు. బావరి అనే బ్రాహ్మణుడు, జ్ఞాన సముపార్జన కోసం అస్మక దేశం నుంచి బుద్ధుని వద్దకు తన శిష్యులను పంపాడు. వారు మొదట కోసల దేశానికి వెళ్ళి, అక్కడి నుంచి రాజగృహకు చేరి, బుద్ధుడి సమక్షంలో బౌద్ధ భిక్షువైనట్లు సుత్తనిపాతం చెబుతోంది. కలావత్తు, పరమార్థదీపని వంటి బౌద్ధ గ్రంథాలలో కూడా ఇలాంటి వృత్తాంతాలే కనిపిస్తాయి. వీటన్నింటిని బట్టి చూస్తే బుద్ధుడి జీవిత కాలంలోనే బౌద్ధధర్మం ఆంధ్రదేశానికి చేరిందని తెలుస్తోంది. శాతవాహనుల కాలంలో భారతదేశమంతటిలో ఆంధ్రదేశం బౌద్ధులకు ప్రధాన కేంద్రమైంది.

శాతవాహనులకు పూర్వం, అశోకుడి కాలానికి చాలాకాలం ముందే 'అంధకులిలో' చైత్యకవాదం ప్రబలంగా ఉందని, దీనికి ధాన్యకటకం (అమరావతి) ప్రధాన కేంద్రమని బౌద్ధమత గ్రంథాలు చెబుతాయి. చైత్యకవాదంలో చైత్యక పూజ ప్రధానమైనది. జగ్గయ్యపేట, అమరావతి, భట్టిప్రోలు స్థూపాల్లో ఉన్న శాసనలిపి మౌర్యుల కాలం నాటిది. ఇటీవలే శాతవాహనుల కాలం నాటివిగా గుర్తించిన బౌద్ధ స్థూపాలు ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రాంతంలోని చందవరం వద్ద, గిద్దలూరు ప్రాంతంలోని దూపాడు వద్ద బయటపడ్డాయి. వీటిలో చందవరం వద్ద స్థూపం మహాచైత్యం. ఆంధ్రదేశంలో అల్లూరు, ఘంటశాల, భట్టిప్రోలు, జగ్గయ్యపేట, నాగార్జున కొండ, చందవరం, నందలూరు, దూపాడు, శాలిహుండం, చినగంజాం, గుంటుపల్లి, శంఖవరం, రామతీర్థం, బొజ్జనకొండ, గుమ్మడిదుర్రు, ధూళికట్ట, తిరుమలగిరి, ఫణిగిరి మొదలైన స్థలాల్లో గొప్ప స్థూపాలు, విహారాలు శాతవాహన యుగ నిర్మాణాలుగా గుర్తించారు.

శాతవాహన యుగంలో మహారాష్ట్రలో కార్లీ, నాసిక్, కన్హేరి, భాజ మొదలైన చోట్ల గుహచైత్యాలు, తూర్పుతీరంలో స్థూప విహారాలు ఆంధ్రదేశంలో వెలిశాయి. బుద్ధుని పాదపద్మాలను పూజించడం హలుని గాథాసప్తశతి ప్రస్తావించింది. చేతివృత్తుల వారు, వర్తకులు, స్త్రీలు బౌద్ధాన్ని ఆదరించి, బౌద్ధ విహారాలకు, బౌద్ధ సంఘాలకు దానాలు చేసినట్లు శాసనాలు చెబుతున్నాయి.

అశోకుడు-ఆంధ్రలో బౌద్ధ మతాదరణ-13వ శిలాశాసనం

అశోకుని 13వ శిలాశాసనం ప్రకారం అతని సామ్రాజ్యంలోని ఆంధ్ర, పిటనిక, భోజక జాతులు బౌద్ధ ధర్మాన్ని అనుసరించినట్లు తెలుస్తోంది. ఇటీవల అమరావతిలో దొరికిన అశోకుని స్థంభకులశం అశోకుడికి ఆంధ్రదేశంతో ఉన్న సంబంధాన్ని నిరూపిస్తుంది. ఇక్కడి తవ్వకాలు, మహాచైత్యం అశోకుడికి పూర్వమే నిర్మితమైనట్లు, అశోకుడు దానిని విస్తరించి, శిల్పాలంకరణకు పూనుకొన్నట్లు తెలుస్తోంది. ఆంధ్రదేశంలో అశోకుడి శాసనాలు కర్నూలు జిల్లాలోని ఎర్రగుడి, రాజుల మందగిరి వద్ద కూడా లభించాయి.

బిక్కు మహాదేవుడు

మూడో బౌద్ధ సంగీతి అనంతరం అశోకుడు అనేక బౌద్ధ భిక్షువులను ధర్మప్రచారం కోసం దేశ విదేశాలకు పంపగా బిక్కు మహాదేవుడు కృష్ణా, గోదావరి నదుల నడుమనున్న 'మహిష మండలా'నికి వచ్చాడని, సింహళ దేశపు బౌద్ధ గ్రంథాలు తెలుపుతున్నాయి.

సువర్ణములక స్థూప ప్రతిష్ట ఉత్సవం

సింహళ దేశంలో 'ధేవనాంపియతిస్సా' అనే రాజు నిర్మించిన సువర్ణ ముల స్థూపాన్ని ప్రతిష్టించే ఉత్సవానికి, భిక్కుమహాదేవుడు 80 వేల మంది భిక్కులతో పల్లవబొగ్గ (పల్నాడు) నుంచి బయలుదేరాడని

సింహళ గ్రంథాలు వివరిస్తున్నాయి. దీన్ని బలపరిచేవిధంగా.. పల్నాటిలోని గొలి, కేసానుపల్లి, నాగార్జునకొండ వంటి బౌద్ధక్షేత్రాలు ఏర్పడి ఉండటం. ఆంధ్రులు బౌద్ధమతాన్ని అనుసరిస్తున్నట్లు చెప్పడం పశ్చిమ దక్కన్‌కు వర్తిస్తుందని.. మహిష మండలంలో అంటే కృష్ణా మైదానంలో బౌద్ధధర్మం విపరీత ధోరణులు కలిగి ఉండటం వల్ల అక్కడి పరిస్థితులు చక్కదిద్ది, స్పష్టమైన, స్వచ్ఛమైన బౌద్ధమతాన్ని నెలకొల్పి ప్రచారం చేసేందుకు భిక్కుమ హాదేవున్ని పంపాడని కాబట్టి అశోకుడి శిలాశాసనం చెబుతోంది.

ప్రాక్టీస్ ప్రశ్నలు

1.బౌద్ధ వ్యాఖ్యాన గ్రంథమైన సుత్తనిపాతం వీటిని ఆంధ్ర జనపదాలుగా పేర్కొంది?

ఎ) అస్సక, ములక బి) కాశి, కోసల
సి) అవంతి, విదర్భ డి) కురు, అనుప

2.గోదావరి నదీ తీరంలో ఆశ్రమం నిర్మించుకొని విద్యాబోధన చేసిన కోసల బ్రాహ్మణుడు బుద్ధుడి శిష్యుడయ్యాడు?

ఎ) ఆచార్య నాగార్జునుడు బి) భావరి
సి) సింహనంది డి)కొండకుందాచార్యుడు

3.ఆంధ్రదేశంలోని స్థూపాలన్నీ వీటితో నిర్మించారు?

ఎ) చలువరాయి బి) ఇటుకలు
సి) గ్రానైట్‌రాయి డి) కొండలను తొలిపించి

4.జర్మన్ పండితుడు హాల్మెట్ హోప్‌మాన్ ప్రకారం ధరణి కోటకు ఆ పేరెలా వచ్చింది?

ఎ) ధాన్య, ధనరాశులు అధికంగా పండించడం వల్ల
బి) బుద్ధుడే స్వయంగా ధారణులను ఇక్కడ నిక్షే పం చేయటం వల్ల
సి) ఎ మాత్రమే
డి) ఎ, బి రెండూ సరైనవే

5.అస్సక రాజులకు బౌద్ధమతం బోధించిన బుద్ధుడి ప్రధాన శిష్యుడు?

ఎ) ఆనంద బి) ఉపాలి
సి) మహాకాత్యాయన డి) మొగలిపుత్తతిస్స

6. సింహళంలోని అనురాధపురంలో సువర్ణములక స్థూప ఆవిష్కరణకు పల్లవ బొగ్గ నుంచి హాజరైన బౌద్ధ బిక్షువు?

ఎ) భావరి బి) మహాదేవుడు
సి) సుజ్జీనుడు డి) సభకామి

7.ఆంధ్రదేశంలో అశోకుడి శిలా శాసనాలు మొట్టమొదట కర్నూలు జిల్లాలోని ఏ ప్రాంతాల్లో లభించాయి?

ఎ) బావికొండ, తాట్లకొండ బి) ధర్మపాలెం, రామతీర్థం
సి) శాలిహండం, పిఠాపురం
డి) ఎర్రగుడి, రాజుల మందగిరి

8.బౌద్ధమతం ఆంధ్రదేశంలోకి ఎప్పుడు ప్రవేశించింది?

ఎ) క్రీ.పూ. 2వ శతాబ్దంలో బి) క్రీ.పూ. 3వ శతాబ్దంలో
సి) బుద్ధుని కాలంలోనే డి) క్రీ.పూ. 4వ శతాబ్దంలో

9.బౌద్ధమతంలోని మహాసాంఘీక చైత్యక సిద్ధాంతాలు (ఉత్తరశైల, అపరశైల, పూర్వశైల, రాజరిక, సిద్ధారక) తదుపరి కాలంలో ఈ బౌద్ధ శాఖగా మారింది?

ఎ) మహాయానం బి) హీనయానం
సి) వజ్రయానం డి) పూర్వమీమాంస

10.అమరావతి స్థూప పలకలపై రూపొందించిన ఏ చిహ్నం.. ఆంధ్ర ప్రదేశ్ రాజచిహ్నంగా ఉంది?

ఎ) స్వస్తిక్ బి) పూర్ణకుంభం
సి) నాలుగు సింహాలు డి) నెమలి

11.సెరివణిజ జాతకం ప్రకారం ఈ నదిపై ఉన్న నగరమే ఆంధ్రనగరి అని పేర్కొన్నారు?

ఎ) కావేరి బి) తేలివాహనది
సి) మహానది డి) తపతీనది

12.ఆంధ్రప్రదేశ్‌లో మహాయాన బౌద్ధ మతానికి ప్రధాన కేంద్రం?

ఎ) అమరావతి బి) ధాన్యకటకం
సి) శాలిహుండం డి) నాగార్జునకొండ

13.నాగార్జున కొండలోని 'అపర మహావినసేవియా' విహారాన్ని నిర్మించింది?

ఎ) ఇక్ష్వాకురాణి శాంతి సిరి బి) గౌతమి బాలశ్రీ
సి) యజ్ఞశ్రీ శాతకర్ణి డి) శివశ్రీ శాతకర్ణి

14. శిథిలావస్థలో ఉన్న అమరావతి స్థూపాన్ని '1797'లో ఎవరు గుర్తించారు?

ఎ) థామస్ హైడ్ బి) కాలిన్ మెకంజీ
సి) థామస్ ప్రిన్సెప్ డి) విలియం జోన్స్

15.ధాతు గర్భస్థూపాలు ఆంధ్రప్రదేశ్‌లోని ఏ ప్రాంతాల్లో బయట పడ్డాయి?

ఎ) భట్టిప్రోలు, అమరావతి, ఘంటసాల
బి) దూపాడు, పెద్ద గంజాం, నాగార్జునకొండ
సి) జగ్గయ్యపేట, ధరణి కోట డి) బి, సి

16.ఆంధ్ర దేశంలో అతి ప్రాచీనమైన బౌద్ధ గుహాలయాలు?

ఎ) నాగార్జునకొండ బి) గుంటుపల్లి
సి) నాసిక్ డి) కార్లే

17.ఆంధ్రప్రదేశ్‌లోని చైత్యక వాదాల్లోని పూర్వశైల మని ఇక్కడి వాదాన్ని అంటారు?

ఎ) అమరావతి బి) గుంటుపల్లి
సి) నాగార్జునకొండ డి) ఏదీ కాదు

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17
	A	B	B	B	C	B	D	C	A	B	B	D	A	B	A	B	A